# చెక్కులు తెచ్చిన చిక్కులు

"నావి రెండు కథలు పడ్డాయండీ ఈ నెలలో" అని తేల్చాడు; పని తొందరమీద వెళ్ళిపోతున్న నన్ను ఆపిన కారణం ఇది చెప్పడానికేనని; ఔత్సాహిక రచయిత గురునాధరావు.

పాపం చాలా రోజులబట్టి రాస్తున్నాడు. ఇన్నాళ్ళకి పెళ్ళికార్డు మీద కాకుండా వేరేచోట అతని పేరు అచ్చయినందుకు నాకూ కొంచెం కులాసా వేసింది.

"అచ్చయిన తొలి రచనలు ఇవేనన్నమాట" అన్నాను. సంచిలోంచి అతను తీసి అందించిన మాసపత్రిక వొకటీ, దినపత్రిక వొకటీ లాంఛనప్రాయంగా వోపెన్ చేస్తూ.

అచ్చులో అతని పేరు చూసేనంతే కథలు చదవడానికి తీరిక లేనట్టు.

"ఊఁ మరి పార్టీ గీర్టీ ఏమీలేదా!" అన్నాను చిర్నవ్వుతో.

"తప్పకుండాను. అందులో మీకు పార్టీ యివ్వకుండా ఎలా వుంటానూ ?" అంటూ పక్కనే వున్న హోటల్ వేపు చెయ్యి చూపించేడు గుర్నాధరావు.

* * *

పది రోజులయింది.

"నా కథలకి పారితోషికంగా చెక్కులొచ్చేయండీ" అని వళ్ళెమంత మొహం చేసుకొని చెప్పాడు గుర్నాధరావు. ఈ మాటూ రోడ్డు మీదనే నన్నాపి.

"కంగ్రాచ్యులేషన్స్."

జేబులోంచి చెక్కులూ, ఫర్వార్డింగ్ లెటర్సూ తీసి చూపించేడు.

"ఇదేమిటీ ! పదిహేను రూపాయలూ పాతిక రూపాయలూనా ? ఇంత తక్కువా ?" అన్నాను.

"ఏదోలెండి. తృణమో పణమో యిచ్చేరు; అదే పదివేలు" అన్నాడు గుర్నాధరావు; అతను పొందుతున్న ఆనందాన్ని దాచేసుకొంటూ.

"ఇంత అల్ప సంతోషిత్వం తగదు" అంటూ ఆ కాగితాలు పరీక్షగా చూసేను. పారితోషికం అందినట్టు రశీదులు సంతకంపెట్టి పంపమని, అందుకు తగిన ఫారాలుంచేరు. పత్రికాధిపతులు, పాతిక రూపాయలు పంపిన పత్రిక వారి రసీదుపై ఇరవై పైసల రెవెన్యూ స్టాంపు అంటించి సంతకంచేసి వుంచాడు గుర్నాధరావు.

"ఇదో దండగా యిందులోను. పైగా వీటికి రెండిటికీ రెండు కవర్లు!" అన్నాను.

"పోనిద్దురూ."

"మనియార్డరు పంపకూడదో యేమో!" అన్నాను విసుగ్గా.

"ఇప్పుడీ చెక్కులు మార్చుకోవాలండి.''

రెండు చెక్కులూ రెండు బ్యాంకులమీద వున్నాయి. మేం నిలబడ్డ చోటికి కొద్దిదూరంలో పదిహేను రూపాయల చెక్కు బాపతు బ్యాంకుంది.

"పద" అన్నాను.

* * *

ఆ రెండు చెక్కులూ క్రాస్ చేయబడి వున్నాయి. అందువల్ల ఆయా బ్యాంకులో అకౌంటు వుంటే తప్ప మార్చబడవుట. సేవింగ్సు అకౌంటు ఐదేసి రూపాయలతో ఓపెన్ చెయ్యడానికి సిదపడిపోయాడు గుర్నాధరావు. అలా పనికిరాదు, కరెంటు అకౌంట్లు వోపెన్ చెయ్యాలన్నారు బ్యాంకువారు. కరెంటెకౌంటు తెరవడానికి కనీసం వంద రూపాయలు డిపాజిట్టుండాలిట.

కలమూ, సిరా,, తెల్లకాగితాలూ, మానవ మనస్తత్వ పరిశీలనా, తీరికా, ఓపికా, పత్రికలకు రచనలు పంపేటందుకు ఖర్మకాలి అవి తిరిగి రావాలంటే అవసరమయ్యే ఖర్చు నిమిత్తం ముందుగా కొనుక్కునే స్టాంపులూ ఈ పెట్టుబడులు కాక ఏ యే పత్రికలకి ఏ యే బ్యాంకులలో అక్కౌంట్లున్నాయో తెలుసుకుని ఆయా బ్యాంకుల్లో కరెంట్ ఎక్కౌంట్లు ఓపెన్ చెయ్యడానికి నూర్లకొద్దీ రూపాయల పెట్టుబడులు కూడా వుండాలనేసరికి నీరు కారిపోయాడు గుర్నాధరావు.

రెండిట్లో ఒక బ్యాంకులో నాకు ఎక్కౌంటుంది. నా పేర్న ట్రాన్స్ఫర్ చేయించుకుంటానని సిద్ధపడ్డాను. కాని, అలా వీలుకాద న్నారు. ఎవరి పేర్న చెక్కులుంటే వారి పేరనే అకౌంటుకూడా వుండాలట.

ఎలాగో కష్టపడి ఏజెంట్లు ఇద్దరితో మాట్లాడి సేవింగ్సు అకౌంట్లు తెరిపించడం ద్వారా పనిచేస్తామని మాట తీసుకుని, చెరో అయిదు రూపాయలు పెట్టుబడిపెట్టి అకౌంట్లలో చెక్కులు డిపాజిట్ చేయించాం.

చెక్కులు కలెక్షన్‌కి పంపిస్తారట. పది రోజుల తరువాత రమ్మన్నారు.

*   *   *

"ఇదిగోనండీ మీరు ఆ రోజు నాకు అప్పు పెట్టిన పది రూపాయలు" అంటూ గుర్నాధరావు పదిహేను రోజుల తరవాత వచ్చాడు.

"చెక్కులు మారేయన్నమాట" అన్నాను డబ్బు తీసుకుంటూ.

"ఏం మారడమో. రెండు చెక్కుల్లోనూ రూపాయిన్నర చొప్పున మొత్తం మూడు రూపాయలు కలెక్షన్ ఛార్జెస్ కింద తగ్గించేరు" అన్నాడు గుర్నాధరావు మొహం వేలేసి.

*   *   *

గుర్నాధరావు కథలు రాస్తూనే వున్నాడు. అయితే అంతకు ముందు స్వతంత్ర భావాలతో విభిన్నమైన ఇతివృత్తాలతో రాసేవాడు. మొత్తం పదహారు రచనలు చదివేను అతనివి. అన్నీ ఇంచుమించు వొకటే మూసలోంచి తీసిన కజ్జికాయల్లా వున్నాయి.

"ఎంచేత, ఇలాగ?" అన్నాను నిష్కర్షగా.

"ఏముందండి! రెండు బ్యాంకుల్లో అకౌంట్లు వోపెన్ చేశానా మరి! మళ్ళీ ఎన్ని బ్యాంకుల్లో అకౌంట్లు వోపెన్ చెయ్యాల్లో అన్న భయంచేత ఆ రెండు పత్రికల వాళ్ళకే రాస్తున్నాను. వాళ్ళకి వొకరకం రచనలే నచ్చుతాయి. అంచేత ఆ రకంగానే రాయక తప్పడం లేదు మరి" అన్నాడు గుర్నాధరావు బుర్ర గోక్కుంటూ.

(29-4-78)